క్లుప్తంగా

ట్రిపుల్ఐటీకి విద్యార్థుల ఎంపిక



ట్రిపుల్ఐటీకి ఎంపికైన విద్యార్థులు

లింగాల : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ఐటీలకు ఎంపికయ్యారు. వెలిదండ్ల జెడ్పీ పాఠశాలకు చెందిన అరుణ్కుమార్రెడ్డి(585) మార్కులతో ఇడుపులపాయ ట్రిపుల్ఐటీలో సీటు లభించింది. అదేవిధంగా పార్నపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్.సిరి (575) మార్కులతో శ్రీకాకుళం ట్రిపుల్ఐటీలో సీటు దక్కించుకుంది. పెద్దకుడా జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సుందరేశ్ శ్రీకాకుళం ట్రిపుల్ఐటీలో సీటు పొందారని ఎంఈఓ రామకృష్ణయ్య తెలిపారు. మండలంలో ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్సీట్లు లభించడం మండలానికి గర్వకారణమన్నారు. ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల పట్టుదలకే ఇది నిదర్శనమని ఆయన కొనియాడారు.

తహసీల్దార్గా బాధ్యతలు చేపట్టిన అలీఖాన్



ముద్దనూరు : స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో మండల తహసీల్దారుగా అలీఖాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. మండల తహసీల్దారుగా ఏడాది కాలంలో ముగ్గురి నియామకాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి తహసీల్దారుగా రామకుమారిని నియమించారు. ఆమె కేవలం కొద్దిరోజులలోనే బదిలీపై వెళ్ళారు. వెంటనే స్థానిక డిప్యూటీ తహసీల్దారు వరదకిషోర్రెడ్డిని పూర్తి ఆదనపు బాధ్యతలతో తహసీల్దారుగా నియమించారు. గత 15 రోజుల క్రితం జీవన్ చంద్రశేఖర్ను తహసీల్దారుగా నియమించారు. తిరిగి ప్రస్తుతం కడప అర్బన్ తహసీల్దారుగా పనిచేస్తున్న అలీఖాన్ను తహసీల్దారుగా నియమించారు.

ఆర్థిక సాయం



నిరుపేద అంకాల్కు నగదును అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని నగరిగుట్టలో నివాసముంటున్న అంకాల్ అనే నిరుపేదకు దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, వైఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఇరికిరెడ్డి వీరారెడ్డి, చేనేత సంఘ ప్రధాన కార్యదర్శి ఈశ్వరయ్య, మాజీ కౌన్సిలర్ నూరుల్లాలు గురువారం రూ.20వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద అంకాల్కు ఇద్దరు కుమార్తెలు ప్రియ, అనూషలు ఉన్నారని, పెద్ద కుమార్తె ప్రియ పెట్రోల్ బంకులో పనిచేస్తూ.. ఇటీవలకాలంలో మృతి చెందిందన్నారు.

పరామర్శ



మస్తాన్ బీని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు హుస్సేన్ భార్య మాజీ సర్పంచ్ మస్తాన్బీని గురువారం వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్రెడ్డి పరామర్శించారు. మస్తాన్ బీ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుంది. సర్పంచ్ నాగార్జునరెడ్డి, మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు సుదర్శన్రెడ్డి పాల్గొన్నారు.

డివైస్ల పంపిణీ



నిరుద్యోగ మహిళలకు డివైస్లను పంపిణీ చేస్తున్న చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ నిరుద్యోగ మహిళలకు డివైస్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిగ్రీ చదివి పొదుపు సంఘంలో ఉండి నిరుద్యోగులుగా ఉన్న మహిళలకు డీజే పథకం కింద డివైస్లు పంపిణీ చేసి ఈ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పలు సేవలను వివరించారు. దీని ద్వారా 200 రకాల ప్రభుత్వ సేవలు ప్రజలకు అందుతాయన్నారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

5న ఆలయ భూమి వేలం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో జూలై 5న శనివారం ఉదయం 10.30 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఈఓ జగన్మోహన్రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పాగులో ఉన్న సర్వే నంబర్ 152/బీలోని 10.06 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించి మూడేళ్ల కాల పరిమితికి గుత్తకు వేలం పాట నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు



జమ్మలమడుగులో మానవహారం నిర్వహించిన విద్యార్థులు

పులివెందుల రూరల్ : మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు.. జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్య, డీఎస్పీ మురళినాయక్లు పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దినోత్సవం సందర్భంగా బాల్యంలో తీసుకుంటున్న డ్రగ్స్, మత్తు.. పిల్లలపై అఘాయిత్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, మహిళలతో పోలీసులు స్థానిక డీఎస్పీ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా గంజాయిని పెంచకు, పంచకు, పీల్చకు, గంజాయి అలవాటు జీవితానికి పొరపాటు అంటూ నినాదాలు చేశారు. అనంతరం పూలంగళ్ల కూడలి వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం, మత్తు పదార్థాలు సేవించిన మత్తులో మహిళలపై అఘాయిత్యాలతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనివల్ల ఎంతో మంది జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై బాధ్యతగా ఉండి తప్పుదారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ అమూల్యమైన జీవితాలను యువత నాశనం చేసుకోవద్దన్నారు. ఇటీవల జమ్మలమడుగు ప్రాంతంలో ఓ యువకుడు మద్యం సేవించి మద్యం మత్తులో చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడం జరిగిందన్నారు మత్తు, మద్యం, గంజాయి తీసుకోవడంవల్లే అలాంటి సంఘటనకు పాల్పడతారన్నారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడంవల్ల అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సీఐలు చాంద్ బాషా, నరసింహులు, వెంకటరమణ, ఉలసయ్య, ఎక్సైజ్ శాఖ సీఐ చెన్నారెడ్డి, ఎస్ఐలు నారాయణ, రవికుమార్, తహసీల్దార్ నజీర్ అహ్మద్, ఎంఈఓచంద్రశేఖరరావు, పోలీసులు, జేఎన్టీయూ కాలేజీ, మహిళ డిగ్రీ కాలేజీ, పాలిటెక్నికల్ కాలేజ్, వేముల కస్తూర్బా కళాశాలల ప్రిన్సిపాల్స్, విద్యార్థులు, రెవెన్యూ, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : మాదక ద్రవ్యాలను నిర్మూలించి యువతను కాపాడుకుందాం అని కమలాపురం ఎస్ఐ విద్యాసాగర్ పిలుపునిచ్చారు. గురువారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కమలాపురం పోలీస్, మదర్ థెరిసాసేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల పోస్టర్స్ రిలీజ్ చేశారు. అలాగే ఎస్ఐతో పాటు ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్కుమార్, ట్రస్ట్ సభ్యులు, పోలీస్ సిబ్బంది కలసి ఆటో తదితర వాహనాలకు పోస్టర్స్ అతికించి మాదక ద్రవ్యాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత చెడు మార్గంలో పయనించ కుండా తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా పెట్టాలన్నారు. సమాజంలో చెడు పట్ల యువత ఆకర్షితులవుతున్నారని, వారిని సన్మార్గంలో నడిచేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఎక్కడైన మాదక ద్రవ్యాలు విక్రయిస్తున్నా, సేవిస్తున్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మదర్ థెరిసా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



పులివెందులలో మాట్లాడుతున్న ఆర్డీఓ చిన్నయ్య



కమలాపురంలో పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఐ విద్యా సాగర్, ట్రస్ట్ సభ్యులు

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా మత్తు పదార్థాలైన గంజాయిని ఎక్కడైనా అమ్ముతుంటే వెంటనే తమకు సమాచారం అందించాలని డీఎస్పీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కాలేజిల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం పాత బస్టాండ్లో మానవహారంగా ఏర్పడ్డారు. డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో విద్యార్థులు చాలా మంది చెడు సవాసాలకు అలవాటు పడి మత్తు పదార్థాలకు బానిసలు అవుతున్నారు. దీని వల్ల సమాజంలో విద్యార్థుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతాయని సూచించారు. మత్తు పదార్థాలు అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే 1972 టోల్ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సూచించారు. అందరం కలసి గంజాయి రహిత సమాజాన్ని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐలు, కాలేజి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పులివెందుల పురవీధులలో ర్యాలీ చేస్తున్న పోలీసులు, విద్యార్థులు



వేంపల్లెలో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపాల్ నాయక్

వేంపల్లెలో

వేంపల్లె : విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటం వలన భవిష్యత్ బాగుంటుందని ఎస్ఐ తిరుపాల్ నాయక్ పిలుపునిచ్చారు. గురువారం వేంపల్లెలోని స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం, అరికట్టడానికి అవగాహన కల్పించడంతోపాటు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సినాల్ నాగేంద్ర మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ఫలితాల గురించి యువకులకు అవగాహన కల్పించడం మన బాధ్యత అన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.ఓబుల్రెడ్డి మత్తుపదార్థాల రహిత సమాజానికి మనమందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐక్యూఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.సతీష్ మాట్లాడుతూ సమాజంలో జరిగే కొన్ని ఉదాహరణల ద్వారా మత్తుపదార్థాల నిర్మూలనకు నడుం కట్టాలని వివరించారు. అనంతరం వారు విద్యార్థులతో కలిసి పట్టణ పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి ఆంక్షలు విధించొద్దు

వేంపల్లె : కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చే అన్నదాత సుఖీభవ పథకానికి ఆంక్షలు, కోతలు విధించొద్దని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి తెలిపారు. గురువారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. టీడీపీ కూటమి మ్యానిఫెస్టోలో ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చిందని, కూటమి ప్రభుత్వాన్ని రైతులు నమ్మి ఓట్లు వేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైన తొలి 2024–25లో రైతులకు ఒక్క పైసా కూడా ఆర్థిక సాయం చేయలేదన్నారు. 2025–26కు గాను ఇప్పటివరకు అన్నదాత సుఖీ భవ పథకం అమలు కాలేదని, సమాచారం మేరకు లబ్ధిదారుల ఎంపికలో అనేక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోందన్నారు. డీకేటీ, చుక్కల భూముల రైతులు, కౌలు రైతులను ఈ పథకం నుంచి తొలగించినట్లు తెలుస్తోందన్నారు. 2024 జనవరిలో 53.58 లక్షల రైతుల ఖాతాలో జమ కాగా, ప్రస్తుతం 45,64,005 మంది రైతులు మాత్రమే అర్హుల ఉన్నట్లు తెలుస్తోందని, గతంతో పోలిస్తే 7.94 లక్షల మంది రైతులు తగ్గారన్నారు. ఆంక్షలు, కోతలు లేకుండా డీకేటీ రైతులకు వర్తింప చేయాలని కోరారు. చుక్కల భూముల రైతులకు వర్తింపచేయడంతోపాటు కౌలు రైతులకు వర్తింపజేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆర్థిక సాయంకు సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా రూ 20.వేల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికులను తొలగించడం అన్యాయం




ఏఓకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు

జమ్మలమడుగు : కడప జీజీహెచ్లో పనిచేస్తున్న కార్మికులను అకారణంగా తొలగించడం అన్యాయమని వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ నాయకులు దాసరి విజయ్, ఏసుదాసుల ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారిని విధుల్లోనికి తీసుకోవాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు ఉత్తర్వులు జారీ చేసినా రిమ్స్ అధికారులు మాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఏజెన్సీ కార్మికులకు ఇవ్వవలసిన ఈఎస్ఐ, కనీస వేతనాలు సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. మోసాలకు పాల్పడుతున్న రిమ్స్ అధికారులను కొనసాగించడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే కార్మికులను విధుల్లోనికి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘8 వసంతాలు’ సినిమాను బ్యాన్ చేయాలి

వేంపల్లె : మైత్రి మూవీస్ పతాకంపై తీసిన 8 వసంతాలు సినిమాను రాష్ట్ర ప్రభుత్వం బ్యాన్ చేయాలని అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘం(ఏబీబీఎం) రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద్ శర్మ డిమాండ్ చేశారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైత్రి మూవీస్ నిర్మాతలు 8 వసంతాల సినిమాలో కాశీలాంటి పవిత్ర క్షేత్రం సీన్ పెట్టి ఫైట్ సీన్స్ పెట్టడంతోపాటు బ్రాహ్మణుడు, ముస్లిం కలిసి ఒక మహిళను రేప్ చేసే సీన్ పెట్టడం సరికాదన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన కాశీలో ఇలాంటి దృశ్యాలు ఉన్నట్లు పెట్టి సినిమాలు తీయడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం ఈ సినిమాను రిలీజ్ కాకుండా చూడాలని కోరారు. మైత్రి మూవీస్ నిర్మాతలు నవీన్ ఏర్నేని, వై.రవిశంకర్, డైరెక్టర్ ఫణీంద్ర నరిశెట్టిల మీద పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనితలను అఖిల భారతీయ బ్రాహ్మణ సంఘం తరపున కోరుతున్నామని పత్రికా ముఖంగా తెలియజేస్తున్నామన్నారు.

డ్రైనేజీ సమస్యలపై సత్వరమే పరిష్కారం



డ్రైనేజీ కాలువలో మురికినీటిని తొలగించిన దృశ్యం

వేంపల్లె : స్థానిక భరత్ నగర్లోని ప్రాంతంలో మురికి కాలువ నిండి, ఆ నీరు రోడ్లపై ప్రస్తుండటంతో ప్రజలు ఈ సమస్యని సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన వెంటనే పారిశుధ్య కార్మికులకు పంపించి సత్వరమే పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ చొరవపట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సర్పంచ్ను విన్నవించారు. త్వరలోనే పరిష్కార మార్గం చూపుతానని ఆయన హామీ ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజామున అగస్త్యేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, మృత్యుంజయ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

గండి టెండర్లు వాయిదా



గండిలో టెండర్లు నిర్వహిస్తున్న అధికారులు

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో పూలు విక్రయం, టోల్గేట్ల వసూలు, షాపింగ్ కాంప్లెక్స్ గదులకొరకు గురువారం నిర్వహించిన బహిరంగ వేలం, టెండర్లను వాయిదా వేసినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్లో అన్య మతస్తులకు ఇవ్వడానికి వీలులేదని బీజేపీ నేతల ఫిర్యాదులు చేశారు. అయితే హిందువులు ఎవ్వరూ పాల్గొనక పోవడంతో వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. అలాగే పూల విక్రయం కోసం ఆరుగురు, టోల్గేట్ల వసూళ్లకు ఐదుగురు దరావత్తు మొత్తం చెల్లించి పోటీ పడకుండా మిన్నకుండిపోయారు. దీంతో వేలం పాటను రద్దు చేసినట్లు ఆయన ప్రకటించారు. తిరిగి వేలం పాటను ఎప్పుడు నిర్వహించేది దేవదాయశాఖ అధికారుల ఆదేశాలతో త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, ప్రధాన ఉప ప్రధాన అర్చకులు కేసరి, రాజారమేష్, చక్రయపేట ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి

జమ్మలమడుగు : రాష్ట్రంలో వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న మూడు లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శరత్కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎర్రగుంట్ల పట్టణంలోని మార్క్స్ భవనంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల హామీలో భాగంగా ప్రతి ఏడాది జనవరిలో జాబ్ కెలండర్ ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇంత వరకు దానిఊసేలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం, ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీలకు తీవ్రమైన అన్యాయం చేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజాపోరాటం తప్పదని హెచ్చరించారు.

నేడు గండి ఆలయ అధికారిపై డీసీ విచారణ

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి దేవస్థానం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్యపై దేవదాయశాఖ కర్నూలు డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్ శుక్రవారం విచారణకు వస్తున్నట్లు ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ తెలిపారు. చైర్మన్గా ఉన్న తనను ఆలయ సహాయ కమిషనర్ ఏమాత్రం విలువ ఇవ్వక అగౌరపరుస్తున్నాడని వెంకటస్వామి అనే వ్యక్తిని పక్కన పెట్టుకుని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని రాష్ట్ర గవర్నర్కు ఫిర్యాదు చేశానన్నాడు. భక్తుల సేవలకు సంబంధించి కూడా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తులను అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నట్లు చేసిన ఫిర్యాదుపై ఈ విచారణ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఇళ్లు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం తగదు

ప్రొద్దుటూరు : ఇళ్లు ఖాళీ చేయాలని పేదలకు అటవీ శాఖాధికారులు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఇర్ఫాన్ బాషా అన్నారు. గురువారం మండలంలోని ఈశ్వర్రెడ్డి నగర్లో ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దశాబ్దాలుగా ఇక్కడ నివాసం ఉంటున్న వారికి అటవీశాఖాధికారులు ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చిన నేతలు.. ఇప్పుడు వారు ఇచ్చిన మాటను మరిచారని విమర్శించారు. ఆలయం, మసీదు, చర్చి నిర్మించుకుని అన్ని మతాల వారు శాశ్వత గృహాలు నిర్మించుకుని 50 ఏళ్లుగా ఇక్కడ జీవిస్తున్నారన్నారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం జారీ చేసిన నోటీసులను పునరాలోచించి వెనక్కి తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ వారికి న్యాయం జరిగే వరకు పోరాడుతుందని తెలిపారు.

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం



మైనర్ బాలుర తల్లిదండ్రులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్చార్జి వైఎస్ మనోహర్రెడ్డి

పులివెందుల టౌన్ : ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలా అండగా ఉంటామని మైనర్ బాలుర తల్లిదండ్రులకు మున్సిపల్ ఇన్ఛార్జి వైఎస్ మనోహర్రెడ్డి భరోసా ఇచ్చారు. పులివెందులలో టీడీపీ తోరణాలు తొలగించారనే నెపంతో అక్రమంగా హత్యాయత్నం కేసు నమోదు చేసి జువైనెల్ హోం జైలుకు పంపిన మైనర్ బాలురు మంగళవారం సాయంత్రం బెయిల్పై విడుదలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, వైఎస్సార్సీపీ పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్లతో కలిసి గురువారం మైనర్ బాలుర తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. చదువు మీద ధ్యాస పెట్టి ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్ సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగపు నాయకుడు జశ్వంత్రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు కిరణ్, మోట రామచంద్ర, రాజశేఖర్, విష్ణు, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

నట్టలనివారణ మందు పంపిణీ



జీవాలకు నట్టలనివారణ మందును అందిస్తున్న సిబ్బంది

ముద్దనూరు : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సామూహిక నట్టల నివారణ మందు పంపిణీని జీవాల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. గురువారం ఆయన సిబ్బందితో కలిసి మండలంలోని ఉప్పలూరు గ్రామంలో నట్టల నివారణ మందుల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు, మేకలలో నట్టల నివారణ మందును తాపించడం వల్ల నులిపురుగులు, బద్దెపురుగులు, ఏలికపాములు, అంతఃపరాన్న జీవులు నివారించబడి జీవాలు ఆరోగ్యంగా వుంటాయని తెలిపారు. కార్యక్రమంలో 2750 గొర్రెలకు, 940 మేకలకు నట్టల నివారణ మందులు తాపించినట్లు పశువైద్యాధికారి తెలిపారు.


ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్ఏ అధ్యక్షుడు, తదితరులు

పులివెందుల టౌన్ : సరైన సదుపాయాలు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ జిల్లా అధ్యక్షుడు దినేష్కుమార్, ఏఐఎస్ఏ పట్టణ అధ్యక్షుడు నరేష్లు తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉన్న ఎంఈఓ రామానాయుడుకు వారు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో సరైన తరగతి గదులు లేవని, విద్యార్థులు ఆడుకోవడానికి కనీసం ఆట స్థలం కూడా లేదన్నారు. విద్యార్థులు ఉండే హాస్టళ్లలో సరైన సదుపాయాలు, తినే భోజనం కూడా సరిగా లేదన్నారు. సరైన వసతులు లేని ప్రైవేట్ పాఠశాలలకు, హాస్టళ్లకు అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. విద్యార్థులకు కనీస సదుపాయాలు కల్పించని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపైన అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఎలాంటి సదుపాయాలు లేని ప్రైవేట్ పాఠశాలల వద్దకు వెళ్లడం జరిగిందని, పాఠశాలల యాజమాన్యాలకు విద్యార్థి సంఘాలతో ఎలా మాట్లాడాలో కూడా తెలియడంలేదన్నారు. ఈ సమస్యలన్ని అధికారులకు తెలియజేస్తామని చెబితే ఎవరినో పెద్ద మనుషలను తెచ్చి భయపెట్టాలని చూస్తున్నారన్నారు. సరైన సదుపాయాలు కల్పించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపైన ఆలిండియా స్టూడెంట్ ఆసోసియేషన్ తీవ్రంగా ఉద్యమిస్తుందన్నారు. విద్యార్థులు చదువుకునేటప్పుడు ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే నివారణకు ఎటువంటి ఎక్విప్మెంట్లు లేవని, విద్యార్థులు కూర్చొనే తరగతి గదిలోకి వర్షపు నీరు వెళుతున్నాయని, ఒక హాస్టల్కు కూడా పర్మిషన్ లేకున్నా హాస్టళ్లను నడుపుతున్నారన్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించాలి



బీఆర్ అంబేద్కర్, మహాత్మ గాంధీ చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, ట్రైనర్, సర్పంచ్లు

పులివెందుల రూరల్ : గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించే విధంగా పనిచేయాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి, ట్రైనర్ నాగభూషణ్రెడ్డిలు సర్పంచ్లకు సూచించారు. గురువారం పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై సర్పంచ్లకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ప్రజలు సర్పంచ్ల దృష్టికి తీసుకొస్తే వారు అధికారుల దృష్టికి తీసుకొచ్చి వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మన చేతుల్లోనే ఆరోగ్యం

ప్రొద్దుటూరు క్రైం : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని డాక్టర్ హిమబిందు తెలిపారు. టీబీ ముక్తిభారత్ కార్యక్రమంలో భాగంగా వైఎంఆర్ కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం, టీబీరోడ్డు సచివాలయాల్లో జరుగుతున్న సర్వేను వైద్యాధికారి హిమబిందు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్న వారు, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం తదితర లక్షణాలు ఉన్న వారు ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. గళ్ల పరీక్షల ద్వారా టీబీ వ్యాధిని నిర్ధారించవచ్చని చెప్పారు. ధూమపానం, మద్యపానం, హెచ్ఐవీ తదితర వ్యాధుల గురించి డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శోభారాణి వివరించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్వైజర్ రాజారత్నం, హెల్త్ విజిటర్ సిద్ధారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎంవీసుబ్బారెడ్డి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.